



# కరపత్రం

SINCE 2014

సోమవారం అక్టోబరు 27 2025 | సంపుటి : 2 | సంచిక : 25 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


## సీఎం రేవంత్ ఎన్నికల ప్రచార షెడ్యూల్ ఖరారు

» అక్టోబర్ 28న బహిరంగ సభతో ప్రచారం ప్రారంభం
» మొత్తం నాలుగు రోడ్ షోలు, ఒక బహిరంగ సభ ప్లాన్
» బహిరంగ సభ పోలీస్ గ్రౌండ్‌లో నిర్వహణ
» రోడ్ షోలు అక్టోబర్ 30, 31, నవంబర్ 4, 5న
» సినీ ప్రముఖులు కూడా ప్రచారంలో పాల్గొననున్నారు



హైదరాబాద్:
సీఎం రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచార షెడ్యూల్ ఖరారైంది. అక్టోబర్ 28వ తేదీనగ బహిరంగ సభతో జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచారాన్ని న రోడ్ షోతో ఆరంభించనున్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ ఆదివారం(అక్టోబర్ 26వ తేదీ) వెల్లడించారు. నాలుగు రోడ్ షోలు, ఒక బహిరంగ సభలో సీఎం రేవంత్ పాల్గొంటారని కాంగ్రెస్ స్పష్టం చేసింది. ఈ నెల 28వ తేదీన సీఎం రేవంత్ బహిరంగ సభకు ప్లాన్ చేసిన కాంగ్రెస్.. ఈ సభను పోలీస్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు తెలిపింది. ఆపై అక్టోబర్ 30, 31, నవంబర్ 4,5 తేదీలలో సీఎం రోడ్ షో చేపట్టనున్నట్లు కాంగ్రెస్ తెలిపింది. పలువురు సినీ ప్రముఖులు కాంగ్రెస్ ప్రచారంలో పాల్గొననున్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు భారీ మెజార్టీ ఖాయం

◆ 46వేల చిన్నారులకు పథకాలు అందుతున్నాయన్నారు
◆ మంత్రుల పంచాయితీ ముగిసిందని వ్యాఖ్య
◆ కొందరు ఎమ్మెల్యేలకు డీసీసీ ఛాన్స్ సూచన
◆ పార్టీ సేవకుల కుటుంబాలకు అవకాశాలు
◆ కేంద్రం సహకారం లేదని విమర్శ
◆ కిషన్‌రెడ్డి మెట్రో-2కి అడ్డంకులు: ఆరోపణ
◆ ఓటు చోరీపై బీఆర్ఎస్ సమాధానం చెప్పాలన్నారు
◆ ఫిర్యాదు సీఎం రేవంత్‌దేనని గుర్తు
◆ అధికారులు జవాబుదారీగా ఉండాలన్నారు




దిల్లీ:
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో గెలుస్తుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో 46వేల మంది చిన్నారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. మంత్రుల పంచాయితీ ముగిసిన అధ్యాయమని పేర్కొన్నారు. దిల్లీ పర్యటనలో ఉన్న మహేశ్‌కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పరిస్థితులను పార్టీ హైకమాండ్ గమనిస్తోందన్నారు.కొందరు ఎమ్మెల్యేలకు డీసీసీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని మహేశ్‌కుమార్‌గౌడ్ అభిప్రాయపడ్డారు. తొలి నుంచి పార్టీకి సేవచేసిన కుటుంబాలకు అవకాశాలు వస్తాయన్నారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి సరైన సహకారం లేదని ఆయన ఆరోపించారు. రాజకీయాలు ఎన్నికల వరకే ఉండాలని, ఆ తర్వాత అందరూ కలిసి రాష్ట్రాభివృద్ధి కోసం పాటుపడాలని అన్నారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 పనులకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అడ్డంకులు పెడుతున్నారని ఆరోపించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 10 ఏళ్లు భారత రాష్ట్రసమితి అభ్యర్థులే గెలిచారని, మరి ఓట్ చోరీ ఎవరు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై తొలుత ఫిర్యాదు చేసింది సీఎం రేవంత్‌రెడ్డే అని గుర్తు చేశారు. అధికారులు, మంత్రులు ఎవరైనా జవాబుదారీగా ఉండాలని సూచించారు.



2లో..

## దేశ రక్షణ ఎంత ముఖ్యమో.. రైతు రక్షణ కూడా అంతే ముఖ్యం

### - వెంకయ్యనాయుడు

హైదరాబాద్:
దేశ రక్షణ ఎంత ముఖ్యమో.. రైతు రక్షణ కూడా అంతే ముఖ్యమనే విషయాన్ని ప్రభుత్వాలు గుర్తించి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరముందని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు.



## ఫీజు బకాయిలు చెల్లించకపోతే నవంబరు 3 నుంచి కళాశాలలు బంద్

### - రమేశ్‌బాబు

హైదరాబాద్:
ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోని ఇంజినీరింగ్‌తో పాటు ఇతర వృత్తి విద్యా కళాశాలలు నవంబరు 3 నుంచి బంద్ పాటిస్తామని తెలంగాణ ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య ఛైర్మన్ రమేష్ బాబు తెలిపారు.

2లో..



## కర్నూలు బస్సు ప్రమాదం..

## కుటుంబ సభ్యులకు మృతదేహాల అప్పగింత

కర్నూలు:
కర్నూలు బస్సు ప్రమాదంలో మరణించిన వారిలో 10 మంది మృతదేహాలను డీఎన్ఏ నివేదిక ఆధారంగా కుటుంబ సభ్యులకు అధికారులు అప్పగించారు. మరణ ధ్రువీకరణ పత్రాలను కూడా వారికి అందించారు. ఈ ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఎ.సిరి పర్యవేక్షించారు. మృతదేహాలను స్వస్థలాలకు చేర్చేందుకు అంబులెన్స్‌లు ఏర్పాటు చేశారు.ఈ ప్రమాదంలో బస్సులోని 19 మంది సజీవ దహనమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మరో గుర్తు తెలియని మృతదేహానికి సంబంధించి చిత్తూరు నుంచి ఒకరు వచ్చారని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. తమ తండ్రి కనిపించడం లేదని ఆ వ్యక్తి చెప్పారన్నారు. డీఎన్ఏ నివేదిక ఆధారంగా ఆ మృతదేహం ఎవరిదనే విషయం తేలుతుందని స్పష్టం చేశారు. ప్రమాద సమయంలో బస్సు డ్రైవర్ మద్యం తాగలేదని నివేదికలో తేలిందని ఎస్పీ చెప్పారు.

## జూబ్లీహిల్స్ ఉపఎన్నికతో భారత రాష్ట్రసమితి కథ పరిసమాప్తం

⊙ జూబ్లీహిల్స్ ఉపఎన్నికతో బీఆర్ఎస్ కథ ముగింపు: తుమ్మల
⊙ ఈ ఎన్నిక తెలంగాణ భవిష్యత్‌ను నిర్ణయిస్తుందని వ్యాఖ్య
⊙ నవీన్ యాదవ్‌కు మద్దతుగా ప్రచారం
⊙ బీఆర్ఎస్ విధ్వంస పాలనపై విమర్శ
⊙ రేవంత్ విజనరీ సీఎం అని ప్రశంస
⊙ నవీన్ గెలిస్తే అభివృద్ధి వేగం పెరుగుతుందని వ్యాఖ్య



హైదరాబాద్:
జూబ్లీహిల్స్ ఉపఎన్నికతో భారత రాష్ట్ర సమితి కథ పరిసమాప్తం కాబోతోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. తెలంగాణ భవిష్యత్‌ను నిర్దేశించే ఈ ఉపఎన్నికలో ప్రజలు చారిత్రక తీర్పు ఇవ్వాలని ఆయన కోరారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా వెంగళరావునగర్ డివిజన్‌లో మంత్రి తుమ్మల ప్రచారం నిర్వహించారు. భారత రాష్ట్రసమితి పాలనలో విధ్వంసం జరిగిందని, ఈ ఉప ఎన్నికలో ఆ పార్టీ కుయుక్తులను తిప్పికొట్టాలని తుమ్మల పిలుపునిచ్చారు. మినీ ఇండియా లాంటి హైదరాబాద్ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి విజనరీగా పని చేస్తున్నారని, జూబ్లీహిల్స్ ఓటర్లంతా సీఎంకు మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. స్థానికుడిగా, ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించడం ద్వారా నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకోవచ్చని తుమ్మల తెలిపారు.



## కర్నూలు ప్రమాదం:

## వాళ్లు టెర్రరిస్టులు, మానవ బాంబులే.. సజ్జనార్ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్:
కర్నూలు బస్సు ప్రమాదంపై హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ స్పందించారు. మద్యం మత్తులో వాహనాలతో రోడ్డుపైకి వచ్చి అమాయకుల ప్రాణాలను పొట్టనబెట్టుకునే వాళ్లు టెర్రరిస్టులు, మానవ బాంబులు కాక ఇంకేమవుతారు.. చెప్పండి!! అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.



2లో

## మరో స్లీపర్ బస్సులో మంటలు..

## ప్రయాణికులు సురక్షితం

ఆగ్రా-లఖ్‌నవూ ఎక్స్‌ప్రెస్‌వేపై మరో ప్రైవేటు బస్సులో మంటలు ల చెలరేగాయి. దిల్లీ నుంచి లఖ్‌నవూ మీదుగా గోండా ప్రాంతానికి వెళ్తున్న ఏసీ స్లీపర్ బస్సులో రెథ్రి టోల్ ప్లాజా లసమీపంలో ఆదివారం మంటలు చెలరేగాయి. తెల్లవారుజామున 4:45 గంటల ప్రాంతంలో టోల్ ప్లాజాకు 500 మీటర్ల ముందు బస్సులో అకస్మాత్తుగా మంటలు చెలరేగినట్లు అధికారులు తెలిపారు.



మిగతాది 2లో

## 8 నెలల్లో 8 యుద్ధాలు ఆపేశా..

### త్వరలో పాక్-ఆఫ్ఘాన్ వివాదం ముగిస్తా: ట్రంప్



వాషింగ్టన్:
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ మరోసారి సెల్ఫ్ డబ్బా కొట్టుకున్నారు. తాను అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక 8 నెలల్లో 8 యుద్ధాలు ఆపానని ప్రగల్భాలు పలికారు. త్వరలోనే పాక్-ఆఫ్ఘాన్ వివాదాన్ని కూడా పరిష్కరిస్తానని అతి విశ్వాసం ప్రదర్శించారు. ఆదివారం (అక్టోబర్ 27) మలేషియాలోని కౌలాలంపూర్‌లో జరిగిన ASEAN శిఖరాగ్ర సమావేశం సందర్భంగా థాయిలాండ్-కంబోడియా దేశాలు శాంతి ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. తన నాయకత్వంలో ఇప్పటికే ఎనిమిది యుద్ధాలు ముగించానని చెప్పారు.

## హైదరాబాద్ జేఎన్టీయూ వంతెనపై కారు బీభత్సం

కేపీహెచ్‌బీ కాలనీ:
హైదరాబాద్‌లోని జేఎన్టీయూ వంతెనపై కారు బీభత్సం సృష్టించింది. ఆదివారం ఉదయం 7.50 గంటల సమయంలో రైతుబజార్ దాటి వంతెన ఎక్కిన కారు.. అతి వేగంతో తొలుత డివైడర్‌ను, ఆ తర్వాత ఓ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి బోల్తా పడింది.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
సోమవారం అక్టోబరు 27 2025

## ఫీజు బకాయిలు చెల్లించకపోతే నవంబరు 3 నుంచి కళాశాలలు బంద్

మొదటిపేజీ తరువాయి

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వకపోవడంతో కాలేజీలు నడిపే పరిస్థితుల్లో లేమన్నారు. రూ.1200 కోట్ల బకాయిలు చెల్లిస్తామని కేవలం రూ.300 కోట్లు మాత్రమే ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు."మంత్రులు మాకు సహకరించడం లేదు. నవంబరు 1 లోపు రూ.900 కోట్లు విడుదల చేయాలి. మిగిలిన బకాయిలపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. నవంబరు 1న రూ.900 కోట్లు విడుదల చేయకపోతే.. 3 నుంచి నిరవధిక బంద్ చేస్తాం. నవంబరు 10వ తేదీ లోపు 2లక్షల మందితో సమావేశం నిర్వహిస్తాం. ప్రభుత్వ వైఖరికి అనుగుణంగా మా నిరసన కార్యక్రమాలు ఉంటాయి. ఫీజురీయింబర్స్ మెంట్ బకాయిలు అడిగినప్పుడే ప్రభుత్వ విచారణలు ఉండకూడదు. వాళ్ల స్వార్థం కోసం మమ్మల్ని భయపెడితే ఊరుకోం. ఒక్క పోలీసును కూడా కాలేజీలోకి అనుమతించం" అని వివరించారు.

## హైదరాబాద్ జేఎన్టీయూ వంతెనపై కారు బీభత్సం

మొదటిపేజీ తరువాయి

సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కారులో ఇద్దరు యువకులు, ముగ్గురు యువతులు ఉన్నారు. యువకులను సూడాన్ దేశస్థులుగా గుర్తించారు. ప్రమాదం జరిగిన తర్వాత యువతులు కారు దిగి మరో క్యాబ్ బుక్ చేసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. బీభత్సం సృష్టించిన కారును అద్దెకు తీసుకున్నారా? ఎవరైనా ఇచ్చారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సూడాన్‌కు చెందిన యువకులు నగరంలో చదువుకుంటూ శంషాబాద్‌లో నివాసముంటున్నారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## దేశ రక్షణ ఎంత ముఖ్యమో.. రైతు రక్షణ కూడా అంతే ముఖ్యం

మొదటిపేజీ తరువాయి

వ్యవసాయం, అనుబంధరంగాల్లో రాణిస్తున్న వారికి రైతు నేస్తం పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వెంకయ్యానాయడు మాట్లాడుతూ.. ఈ దేశంలో 58శాతం మంది వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలపైన ఆధారపడి ఉన్నారని గుర్తు చేశారు. రైతులకు చేదోడుగా, తన వంతు కర్తవ్యంగా రెండు దశాబ్దాలకు పైగా 'రైతు నేస్తం' మాసపత్రిక ద్వారా సేవలందిస్తున్న యడ్లపల్లి వెంకటేశ్వరరావును వెంకయ్యానాయుడు అభినందించారు."జీవితంలో ఇతరుల కోసం పనిచేసే వారే అన్నదాతలు. దేశానికి అన్నం పెడుతున్న అన్నదాతలను ఎప్పుడూ మర్చిపోకూడదు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా సరైన వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. అప్పుడే వ్యవసాయం నిలబడుతుంది. రైతు శ్రమకు సరైన న్యాయం జరిగే విధంగా మన వ్యవస్థలో మార్పులు తేవాల్సిన అవసరముంది" అని వెంకయ్య నాయడు అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## మరో స్లీపర్ బస్సులో మంటలు.. ప్రయాణికులు సురక్షితం

మొదటిపేజీ తరువాయి

దీంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ ప్రయాణికులందరినీ కిందకు దించేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక బృందాలు ఘటనా స్థలానికి చేరుకొని..మంటలు ఆర్పివేశారు. బస్సులో ఉన్న దాదాపు 39 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. మొదట బస్సు చక్రంలో ప్రారంభమైన మంటలు వాహనంలోని మిగిలిన భాగాలకు వ్యాపించినట్లు డ్రైవర్ జగత్ సింగ్ తెలిపాడు. ప్రమాదం విషయం తెలుసుకున్న ప్రైవేటు బస్సు యాజమాన్యం ప్రయాణికులకు మరోబస్సును ఏర్పాటు చేసింది. బస్సుకు మంటలు అంటుకోవడానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## వాళ్లు టెర్రరిస్టులు, మానవ బాంబులే.. సజ్జనార్ సంచలన వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి

కర్నూలు బస్సు ప్రమాదం నేపథ్యంలో హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ తాజాగా ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ..'ఒక్కరి నిర్లక్ష్యం.. 20 మందిని ప్రాణాలను బలితీసుకుంది. మద్యం మత్తులో వాహనాలతో రోడ్డుపైకి వచ్చి అమాయకుల ప్రాణాలను పొట్టనబెట్టుకునే వాళ్లు టెర్రరిస్టులు, మానవ బాంబులు కాక ఇంకేమవుతారు.. చెప్పండి!!. వాళ్ళు చేసిన ఈ తప్పిదం వల్ల ఎన్ని కుటుంబాలు మానసిక క్షోభను అనుభవిస్తున్నాయి. మీ సరదా, జల్సా కోసం ఇతరుల ప్రాణాలను తీసే హక్కు మీకు ఎవరిచ్చారు!?.

సమాజంలో మన చుట్టే తిరిగే ఇలాంటి టెర్రరిస్టులు, మానవ బాంబుల పట్ల జాగ్రతగా ఉండండి. వీరి కదలికలపై వెంటనే డయల్ 100 కి గానీ, స్థానిక పోలీసులకు గానీ సమాచారం ఇవ్వండి. చూస్తూ చూస్తూ వాళ్ళను ఇలాగే వదిలేస్తే రోడ్డు మీదకు వచ్చి ఎంతో మందిని చంపేస్తారు. వారిని మాకెందుకులే అని వదిలేస్తే చాలా ప్రాణ నష్టం జరుగుతుంది' అని పోస్టు చేశారు.

## 8 నెలల్లో 8 యుద్ధాలు ఆపేశా..

### త్వరలో పాక్-ఆఫ్ఘాన్ వివాదం ముగిస్తా: ట్రంప్

మొదటిపేజీ తరువాయి

పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ మధ్య కూడా త్వరగా శాంతిని తీసుకువస్తానని.. ఆ రెండు దేశాల అధినేతలు తనకు చాలా బాగా తెలుసని పేర్కొన్నారు. ఎనిమిది నెలల్లో 8 యుద్ధాలు ముగించడం అనేది గతంలో ఎప్పుడూ జరగలేదని.. ఇకమీదట కూడా ఇది సాధ్యం కాదని పగల్భాలు పలికారు.

యుద్ధాలను ముగించడం అనేది ఒక గొప్ప పనిగా తాను భావిస్తున్నానని.. లక్షలాది మంది ప్రాణాలను కాపాడగలిగితే అది గొప్ప కృషి అవుతుందన్నారు. ఒక యుద్ధాన్ని పరిష్కరించిన ఏ అధ్యక్షుడి గురించి తాను ఆలోచించలేనని.. వాళ్లు కేవలం యుద్ధాలను ప్రారంభిస్తారని.. వాటిని పరిష్కరించరన్నారు. కాగా, ట్రంప్ తాను ఆపానని చెప్పుకుంటున్న 8 యుద్ధాల్లో ఇండియా, పాక్ వివాదం కూడా ఒకటి.కానీ ట్రంప్ ఆరోపణలను భారత్ ఎప్పటికప్పుడూ తిప్పికొట్టింది. ఇండియా, పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందంలో మూడో వ్యక్తి లేదా దేశ ప్రమేయం లేదని ట్రంప్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చింది. ఇండియా ఎన్నోసార్లు ఖండించినప్పటికీ.. ఇండియా, పాక్ వార్ తానే ఆపానని డప్పు కొట్టుకుంటున్నారు.

# వాయుగుండాలు, తుఫాన్ తీవ్రత తెలియజేసేలా ప్రమాద హెచ్చరికలు.. ఏవి అత్యంత తీవ్రమైనవి..?



తుఫాన్లు, వాయుగుండాలు ఏర్పడినప్పుడల్లా వాతావరణ శాఖలు ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తుంటాయి. ఇవి తుఫాన్ తీవ్రత, దిశ, దూరం ఆధారంగా ప్రజలు, పోర్టు అధికారులు, మత్స్యకారులు ముందుగానే జాగ్రత్తలు తీసుకునేందుకు ఉపయోగపడతాయి. భారత వాతావరణ విభాగం తుఫాన్ల తీవ్రతను సూచించేందుకు 1 నుంచి 11 వరకు నంబర్లలో ప్రత్యేక హెచ్చరికల వ్యవస్థను అమలు చేస్తుంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ తీరాన్ని లక్ష్యంగా చేసుకున్న "మొంథా" తుఫాన్ కారణంగా మచిలీపట్నం, కృష్ణపట్నం, నిజాంపట్నం పోర్టులకు ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. ఇక ఈ హెచ్చరిక నంబర్ల వెనక ఉన్న అర్థం ఏమిటో చూద్దాం..

### 1, 2వ నంబరు హెచ్చరికలు ప్రాథమిక జాగ్రత్తలు

తుఫాన్ ఒక పోర్టు నుండి 400 నుంచి 750 నాటికల్ మైళ్ల దూరంలో ఉన్నప్పుడు 1వ లేదా 2వ నంబరు హెచ్చరికలు జారీ చేస్తారు. ఇవి కేవలం జాగ్రత్త సూచనలే. తుఫాన్ దిశ, గాలి ఒత్తిడి మార్పులను పర్యవేక్షించమని సూచిస్తాయి.

### 3, 4వ నంబరు హెచ్చరికలుఅప్రమత్తత దశ

తుఫాన్ 150 నుంచి 400 నాటికల్ మైళ్ల దూరంలో ఉన్నప్పుడు ఈ హెచ్చరికలు వస్తాయి. ఈ దశలో తుఫాన్ ప్రభావం మొదలయ్యే అవకాశం ఉన్నందున పోర్టు అధికారులు అప్రమత్తంగా ఉండాలి.

### 5, 6వ నంబరు హెచ్చరికలుప్రమాద సూచికలు

ఇవి తుఫాన్ 50 నుంచి 150 నాటికల్ మైళ్ల దూరంలో ఉన్నప్పుడు జారీ చేస్తారు. ఈ సమయంలో గాలులు బలంగా వీచి, సముద్రం ఉప్పొంగుతుంది. పోర్టు పరిసరాల్లో అలల ఎత్తు పెరుగుతుంది. సాధారణంగా ఈ దశలో పోర్టు కార్యకలాపాలను నిలిపివేస్తారు.

### 8 నుంచి 10వ నంబరు హెచ్చరికలు అత్యంత ప్రమాద స్థాయి

తుఫాన్ 50 నాటికల్ మైళ్ల లోపలకి చేరుకున్నప్పుడు ఈ హెచ్చరికలు జారీ చేస్తారు. అంటే తుఫాన్ తీరాన్ని తాకే అవకాశముందని అర్థం. గాలి వేగం 80 నుంచి 200 కి.మీ. వరకు ఉండవచ్చు. ఈ దశలో పోర్టులు పూర్తిగా మూసివేసి, నౌకలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తారు. ఎమర్జెన్సీ రెస్క్యూ టీమ్‌లు సిద్ధంగా ఉంటాయి.

### 11వ నంబరు హెచ్చరిక అత్యవసర పరిస్థితి

ఇది అత్యున్నత స్థాయి హెచ్చరిక. తుఫాన్ పోర్టు సమీపాన లేదా దాని మీదుగా దూసుకువస్తున్నప్పుడు జారీ చేస్తారు. తీవ్రమైన గాలులు, భారీ వర్షాలు కారణంగా విద్యుత్, కమ్యూనికేషన్, రవాణా వ్యవస్థలు దెబ్బతినే అవకాశం ఉంటుంది. ప్రజలు, సిబ్బంది వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించబడాలి.తుఫాన్ల తీవ్రతను బట్టి 1 నుంచి 11 వరకు ఉన్న ఈ హెచ్చరిక వ్యవస్థ తీరప్రాంత ప్రజలు, మత్స్యకారుల భద్రతకు కీలకం. ఈ సూచనల అర్థం తెలుసుకుంటే ముందుగానే చర్యలు తీసుకుని ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడవచ్చు.

# మరింత స్లిమ్‌గా రోహిత్.. ఫిట్‌మ్యాన్‌గా మరింత కాలం హిట్‌మ్యాన్ జర్నీ..!

ఛాంపియన్స్ ట్రోఫీ ముగిసే నాటికి అధికబరువుతో అవస్థలు పడుతున్న రోహిత్‌ను చూసిన ఫ్యాన్స్ 2027 ప్రపంచకప్ వరకు ఫిట్‌నెస్ ఉంటుందా అని ఆందోళన చెందారు. ఐపీఎల్ 2025లో చివరి సారిగా అతడు కనిపించాడు. నాడు కట్ చేస్తే.. ఆస్ట్రేలియా వన్డే సిరీస్ ముందు సియాట్ అవార్డ్స్ ఫంక్షన్‌కు స్లిమ్‌గా మారిన హిట్‌మ్యాన్‌ను చూసి అభిమానులు ఆశ్చర్యపోయారు. జెర్సీ నెంబర్ 45లో 'టార్గెట్ 2027' లోడ్ అవుతోందని నెట్టింట ఫ్యాన్స్ సంబరాలు చేసుకొన్నారు. తాజాగా అతడి చిరకాల మిత్రుడు అభిషేక్ నాయర్ స్పందిస్తూ.. రోహిత్ వెయిట్‌లాస్ జర్నీ మరింతకాలం కొనసాగుతుందని వెల్లడించాడు. గత మూడు నెలల్లో అతడు 11 కిలోల బరువు తగ్గినట్లు చెప్పాడు.

"రోహిత్ ఫ్లైట్‌లో భారత్‌కు తిరిగి వచ్చే సమయంలో విశ్రాంతి తీసుకొంటాడు. ఇష్టమైన ఆహారాన్ని వదిలేశాడు. దాని ఫలితాలు ఈ సిరీస్‌లో కనిపించాయి. సౌతాఫ్రికాతో సిరీస్‌కు మరో నెల రోజుల సమయం ఉంది. నాటి కల్లా మరింత బరువు తగ్గి కనిపించినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు" అని నాయర్ సిడ్నీ మ్యాచ్ సమయంలో బ్రాడ్‌కాస్టర్ వద్ద వ్యాఖ్యానించాడు.

### నాయర్ సాయంతో రోహిత్ ఫిట్‌నెస్‌పై దృష్టి

వాస్తవానికి రోహిత్ కు టీమ్ ఇండియా మాజీ కోచ్ అయిన నాయరే జిమ్‌లో సాయం చేశాడు. నిత్యం రోహిత్ 3.30 గంటలు కసరత్తులు చేస్తున్నాడని ఇటీవల పెర్త్‌లో మ్యాచ్ సమయంలో మరికొన్ని విషయాలు వెల్లడించాడు.



అత్యధిక రిపిటేషన్లతో బాడీబిల్డర్ స్థాయిలో చమటోడుస్తున్నాడని అభివర్ణించాడు.

"అతడి ట్రైనింగ్ చాలా మందిని ఆశ్చర్యపరుస్తుంది. చివరికి టీమ్ ఇండియా కండీషనింగ్ కోచ్ కూడా నన్ను మందలిస్తాడు. రోహిత్ రోజుకు శరీరంలోని ప్రతి భాగం కోసం 700-800 రిపిటేషన్లు చేసేవాడు. అది దాదాపు గంటన్నర సెషన్. ఇది తేలికపాటి బరువులతో జరిగేది. దీంతోపాటు ప్రతి సెషన్‌లో 15-20 నిమిషాలు క్రాస్ ఫిట్ ట్రైనింగ్ చేసి ముగించేవాళ్లం. ఇది గుండె పనితీరును మరింత మెరుగు పరుస్తుంది. వారంలో ఆరు రోజులపాటు ఇలా మూడు నెలలు శిక్షణ జరిగింది.

అక్కడితో ముగియలేదు. అతడు తన ఆహారపు అలవాట్లను నియంత్రించుకొన్నాడు. ముంబయిలోని ఫేమస్ అయిన వడాపావ్‌ను తినడం కూడా మానేశాడు. ఆటపట్ల అతడి నిబద్ధత అది. మూడు గంటలు జిమ్‌లో పడిన శ్రమ ఫలించాలంటే.. ఆ తర్వాత 21 గంటలు నియంత్రించుకోవడం అవసరం.

తొలి ఎనిమిది వారాలు కఠినమైన శిక్షణ జరిగింది. కండరాలు పెంచే కంటే.. చురుకైన క్రికెటర్‌గా ఉండేందుకే రోహిత్ ఇష్టపడ్డాడు. ఆ తర్వాత వస్తున్న ఫలితాలకు అనుగణంగా శిక్షణలో మార్పులు చేశాము. ఇక తొలిసారి ప్రాక్టిస్‌కు వెళ్లినప్పుడు.. అతడు ఓ డిఫెన్స్ షాట్ ఆడి నాన్‌స్ట్రైకర్ వైపు పరిగెత్తాడు. వెంటనే 'సోదరా.. నేను గాల్లో ఎగురుతున్నాను' అని గట్టిగా అరిచి చెప్పాడు. చాలా కాలం తర్వాత అతడు తేలిగ్గా ఫీల్ అయ్యాడు.

### ముగిసిన రో-కో ఆసీస్ టూర్.. నెక్స్ట్ ఏంటి?

2011లో కూడా రోహిత్ ఇలాంటి ఫిట్‌నెస్ సాధించాడు. నాడు అతడు లావుగా ఉన్న ఫొటో సోషల్ మీడియాలో ప్రచారంలోకి వచ్చింది. దీంతో అప్పుడు బరువు తగ్గాడు. ఇటీవల ఐపీఎల్ తర్వాత అతడు వెకేషన్‌లో ఉన్నవేళ అలాంటి ఫొటోనే ప్రచారంలోకి వచ్చింది. రోహిత్ ఫిట్‌నెస్ చర్చ మొదలైంది. దీంతో బరువు తగ్గాలని అతడు నిర్ణయించుకొన్నాడు. 2027 వరకు కెరీర్‌ను పొడిగించుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో అతడు ఫిజికల్‌గా ఫిట్‌గా ఉండటం చాలా కీలకం. తొలుత 10 కిలోలు తగ్గడం లక్ష్యంగా పెట్టుకొన్నాం. అది సాధ్యం కాదని అతడు తొలుత భావించాడు. టోర్నమెంట్లు కూడా లేకపోవడం మా నిరంతర సాధనకు కలిసి వచ్చింది" అని నాడు అభిషేక్ నాయర్ వెల్లడించాడు.

# భారత్‌తో సెమీ ఫైనల్.. ఆస్ట్రేలియా కెప్టెన్ అలీసా హీలీ దూరం!

మహిళల వన్డే ప్రపంచ కప్ 2025 సెమీ ఫైనల్‌లో భారత్‌కు కఠిన ప్రత్యర్థి ఎదురైంది. వరల్డ్ కప్ కలను నెరవేర్చుకోవాలంటే ముందుగా సెమీస్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాను ఓడించాల్సి ఉంటుంది. అక్టోబర్ 30న నవీ ముంబయిలో జరగనున్న ఈ కీలక మ్యాచ్‌కు ఆసీస్ కెప్టెన్ అలీసా హీలీ దూరమయ్యే అవకాశముంది. ఇంగ్లాండ్‌తో మ్యాచ్‌కు ముందు బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తుండగా హీలీ గాయపడింది. పిక్క కండరానికి గాయమవడంతో ఇంగ్లాండ్, సౌతాఫ్రికా మ్యాచ్‌లకు దూరమైంది. అయితే, ఆ రెండు మ్యాచ్‌ల్లో అలీసా లేని లోటు కనిపించలేదు. రెండింటిలోనూ ఆస్ట్రేలియా భారీ విజయం సాధించింది. తాజాగా అలీసా గాయం గురించి



ఆసీస్ హెడ్ కోచ్ షెల్లీ నిట్చ్కే అప్‌డేట్ ఇచ్చారు. హీలీ ఇంకా పూర్తిస్థాయిలో కోలుకోలేదని ఆదివారం పేర్కొన్నారు.

'అలీసా పూర్తి స్థాయిలో కోలుకోలేదు. ఆమె పరిస్థితిని ఎప్పటికప్పుడు వైద్యులు పర్యవేక్షిస్తున్నారు. సెమీ ఫైనల్‌కు ఇంకా సమయం ఉంది. అప్పటికల్లా హీలీ కోలుకుని సెమీస్‌లో ఆడుతుందని ఆశిస్తున్నాం' అని ఆసీస్ హెడ్ కోచ్ తెలిపారు.ఈ టోర్నీలో ఇప్పటివరకు నాలుగు మ్యాచ్‌లే ఆడిన హీలీ 294 పరుగులు చేసింది. భారత్‌తో జరిగిన లీగ్ మ్యాచ్‌లో అలీసా ఆకాశమే హద్దుగా చెలరేగింది. 107 బంతుల్లోనే 21 ఫోర్లు, 3 సిక్స్‌లతో 142 పరుగులు చేసి టీమ్‌ఇండియా నుంచి మ్యాచ్‌ను లాగేసుకుంది. బంగ్లాదేశ్‌పై కూడా సెంచరీ (113లి) చేసింది. టీమ్‌ఇండియా చివరగా 2017 వన్డే ప్రపంచకప్‌లో ఫైనల్ చేరింది. అప్పుడు సెమీస్‌లో ఆస్ట్రేలియాపైనే గెలిచింది.

## మస్కట్‌లో సిరిసిల్ల యువకుడి నరకయాతన.. కాపాడాలంటూ వేడుకోలు! వీడియో

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన సతీష్ అనే యువకుడు మస్కట్‌లో అష్టకష్టాలు పడుతున్నాడు. కుటుంబ పరిస్థితులు సరిగాలేక ఉపాధి ఆశతో విదేశాలకు వెళ్తే.. అక్కడ పీకల్లోతు సమస్యల్లో చిక్కుకున్నాడు. 'మంచి జాబ్ ఉంది, జీవితమే మారిపోతుంది' అని ఆశలు చూపిన గల్ఫ్ ఏజెంట్ మాటలు నమ్మి, మస్కట్



వెళ్లిన సతీష్ ఎదుర్కొన్నది మాత్రం చేదు అనుభవం. అక్కడ ఉద్యోగం దొరక్కపోగా.. సౌకర్యాలు లేని చోట ఒంటరిగా, దయనీయ పరిస్థితుల్లో బతుకుతున్నాడు.తినడానికి సరైన ఆహారంలేక, రోజులు గడవడం కూడా కష్టంగా మారింది. తన పరిస్థితిని ఎవరికీ చెప్పుకోవాలా..? అని ఆవేదనతో కన్నీరు పెట్టుకున్న సతీష్ చివరకు తన బాధను సెల్ఫీ వీడియో రూపంలో బయటపెట్టాడు. ఈ వీడియోలో సతీష్ తన గోడునంత వెల్లగక్కాడు. నన్ను భారత్‌కు తీసుకెళ్లండి. 'మా అమ్మా నాన్న దగ్గరికి వెళ్లాలనుంది' అంటూ కన్నీళ్లు పెట్టుకున్నాడు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సతీష్ ఆవేదన విన్న వారందరూ కదిలిపోయారు. సతీష్ తల్లిదండ్రులు కొడుకుతో ఎప్పుడు ఫోన్‌లో మాట్లాడినా ఊరికిగి మళ్లీ తిరిగి వస్తానంటున్నాడని, కానీ ఇప్పుడు ఆ మాటలు కూడా ఆశగా మిగిలిపోయాయని చెబుతున్నారు. ఏజెంట్ మమ్మల్ని మోసం చేశాడు. మా కొడుకును ఇంటికి రప్పించండి అంటూ వారు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

# లయన్స్ డిస్ట్రిక్ట్ 320G సర్వీస్ ట్రస్ట్ లో ఉచిత మధుమేహం , రక్తపోటు పరీక్షలు

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 26**
లయన్స్ డయాగ్నస్టిక్ అండ్ సీటీ స్కాన్ సెంటర్, లయన్స్ డిస్ట్రిక్ట్ 320G సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మధుమేహం , రక్తపోటు పరీక్షా శిబిరం శాతవాహన విశ్వవిద్యాలయం వద్ద నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం పరిసర ప్రాంతాలలోని వాకర్లు , నివాసులు చురుకుగా పాల్గొన్నారు. మొత్తం 80 మంది పరీక్షించబడి, వారికి మధుమేహం , రక్తపోటు సంబంధిత జాగ్రత్తలు, ఆరోగ్య సూచనలు తెలియజేయడం జరిగింది.
ఈ శిబిరాన్ని లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ టౌన్ - గోల్డెన్ శాతవాహన, బాలాజీనగర్, శ్రీనిధి, శాతవాహన, రాజరాజేశ్వరి, స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్లతో



కలిసి నిర్వహించగా, రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి వి. రాధాకృష్ణా రెడ్డి , ఇతర సభ్యులు పాల్గొన్నారు.
ట్రస్ట్ చైర్మన్ లయన్ హెచ్. రాజిరెడ్డి మాట్లాడుతూ నవంబర్ నెలను ప్రపంచ మధుమేహ అవగాహన నెలగా జరుపుకుంటామని, ఈ సందర్భంగా కరీంనగర్ పట్టణంలోని కాలనీలు, అపార్ట్మెంట్స్ , గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఇలాంటి ఉచిత పరీక్షా శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, తమ బంధుమిత్రులకు ఈ సేవల గురించి తెలియజేయాలని ఆయన కోరారు.
లయన్స్ డయగ్నస్టిక్ అండ్ సీటీ స్కాన్ సెంటర్ లో అత్యాధునిక యంత్రాలతో అత్యల్ప ధరల్లో నాణ్యమైన పరీక్షా సేవలు, అన్ని రకాల సిటీ స్కాన్ సేవలు అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఆరోగ్య సేవా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన అన్ని లయన్స్ క్లబ్ సభ్యులకు ట్రస్ట్ ధన్యవాదాలు తెలియజేసారు.

# జూబ్లీహిల్స్ బై ఎలక్షన్ ప్రచారంలో జిల్లా నాయకులు

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని అక్టోబర్ 26:**



జూబ్లిహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక ప్రచారంలో పెద్దపల్లి జిల్లా బిజెవైఎం నాయకులు జూబ్లిహిల్స్ నియోజకవర్గ బిజెవైఎం ఇంచార్జ్ బద్రి దేవేందర్ పటేల్ పాల్గొని ప్రచారం చేశారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా బీజేపీ అభ్యర్థిని బారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయడం లో కాంగ్రెస్ పార్టీ విఫలం అయ్యిందని దేవేందర్ పటేల్ పేర్కొన్నారు. ఒంటెద్దు పోకడ పోతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి జూబ్లిహిల్స్ బై ఎలక్షన్ కనువిప్పు అయ్యేలా ఉండాలని పేర్కొన్నారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రచార కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ సెల్ నాయకులు రాగుల కిరణ్ కుమార్ గౌడ్, స్టేట్ ఇంచార్జ్ నవీన్ కుమార్, యూసఫ్ గూడా ఇంచార్జ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎరకల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి. రాష్ట్ర అధ్యక్షులు లోకినీ రాజు.

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 26**
తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షులు కుతాడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం రోజున అంబేద్కర్ విగ్రహం కరీంనగర్ కోర్టు చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు లోకిని రాజు హాజరై మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా ఆదివాసి ఎరుకల ప్రజలు విద్యా ఉద్యోగాలు ఉపాధి అవకాశాలేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారనీ, ఇతర గిరిజన తెగలతో పోల్చుకుంటే అభివృద్ధిలో చాలా వెనుకబడి ఉన్నామని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మా తరఫున అసెంబ్లీలో ,శాసనసభలో గాని ఎరుకల సమస్యల మీద మాట్లాడేవాళ్లు లేకపోవడం వల్ల మా సమస్యలు ప్రభుత్వ దృష్టికి పోవడంలేదని ఆవేదన వ్యక్తపరిచారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి మా డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారంగా ఆదివాసి ఎరుకల అభివృద్ధి కోసం ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి 500 కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు.
తెలంగాణ వ్యాప్తంగా పందులపై ఆధారపడి జీవిస్తున్న వేలాది కుటుంబాల అభివృద్ధి కోసం గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎరుకల ఎంపవర్మెంట్ స్కీమును అమలు చేయాలని ,తెలంగాణ వ్యాప్తంగా కనుమరుగై పోతున్న ఆదివాసి ఎరుకల కులవృత్తులు ఎరుకల సోది ,



తట్టలు, బుట్టలు, గంపలు, పోనుకలు, చీపుర్లు ప్రోత్సాహం కింద
బ్యాంకు తో సంబంధం లేకుండా ప్రతి కుటుంబానికి 10 లక్షల ఏకలవ్య బంధువు ఇవ్వాలని ,రాష్ట్రవ్యాప్తంగా చదువుకున్న ఆదివాసి ఎరుకల విద్యార్థి ,విద్యార్థులు ఇతర విద్యార్థి - విద్యార్థులతో పోటీ పరీక్షలలో అర్హత పొందడానికి హైదరాబాదు కేంద్రంగా ప్రత్యేక ఏకలవ్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ,
రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసీ ఎరుకల నిరుద్యోగ యువతీ యువకులకు గిరిజన సంక్షేమ శాఖ తో పాటు అన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లో ఔట్ సోర్స్ ఉద్యోగాలు కల్పించాలని ,
విద్యారంగంలో వెనుకబడి పోతున్న ఆదివాసి ఎరుకల విద్యార్థి విద్యార్థుల కోసం ఏకలవ్య మోడల్ స్కూల్ లో గాని గురుకుల పాఠశాలలో ఆదివాసి ఎరుకల విద్యార్థి విద్యార్థులకు ప్రత్యేక సీట్లు కేటాయించాలని ,
నేషనల్ ఎస్టీ కమిషన్ గైడ్ లైన్స్ ప్రకారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేసినట్టుగా తెలంగాణ రాష్ట్రంలో కూడా ప్రత్యేక ఎస్టి కమిషన్ ఏర్పాటు చేసి ఎస్టీ కమిషన్ చైర్మన్ గా ఆదివాసి ఎరుకల సామాజిక వర్గానికి అవకాశం కల్పించాలని ,
రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12 ఎస్టి రిజర్వుడ్ ఎమ్మెల్యే స్థానాలలో , 2 పార్లమెంట్ స్థానాలలో లంబాడి, కోయ , గోండు తెగలు ఇప్పటికీ అవకాశాలు పొందుతూనే ఉన్నారనీ,
ఆదివాసి ఎరుకల తెగను గుర్తించి అన్ని రాజకీయ పార్టీలు రాజకీయ అవకాశాలు కల్పించాలని అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేస్తున్నాం అని తెలిపారు.
ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనేటి రాజు,మంచిర్యాల జిల్లా అధ్యక్షులు దుగ్యాల బాబు, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు అంగిడి కుమారస్వామి,కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు కుతాడి కుమారస్వామి,కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు కుతాడి తిరుపతి,కట్ట రాజు బీజేపీ ఎస్టి సెల్ అధ్యక్షులు కోశాధికారి మణుపాటి మల్లేషం, సహాయక కార్యదర్శి కుతాడి కుమార్ ,పెద్దపల్లి జిల్లా నాయకులు మానుపాటి యల్లయ్య, మొగిలి శ్రీనివాస్, జిల్లా నాయకులు కేంసారం రమేష్,కేంసారం సమ్మయ్య, కుతాడి పరశురామ్,కుతాడి ఎల్లయ్య, కుతాడి ఎల్లస్వామి, కేంసారం కనుకయ్య, మేరగుత్త నాగరాజు , తదితరులు పాల్గొన్నారు.

# బాల్ నగర్ లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**- ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్**



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**



వేములవాడ మున్సిపల్ పరిధిలోని బాల్ నగర్ లో ఫ్యాక్స్ సోసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం మార్కెట్ కమిటీ చెర్మెన్ రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వారన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకంగా కొనుగోళ్లు జరగాలని,రైతులను ఎవరైనా ఇబ్బంది పడితే వెంటనే సమాచారం ఇవ్వాలని, ఎవరైనా అవినీతికి పాల్పడితే సహించేది లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి, డైరెక్టర్లు ఖమ్మం గణేష్, కత్తి కనకయ్య, విద్యాసాగర్ ,పరశురాం నాయకులు కూరగాయల కొమరయ్య, సంఘ స్వామి యాదవ్, తోట రాజు, పులి రాంబాబు, అన్నారం శ్రీనివాస్, పుల్కం రాజు, పీర్ మహమ్మద్, దాడి మల్లేశం, అంబాటి చందు, సాయిని అంజయ్య, కుతాడి రాజేశం, కొక్కుల బాలు, కొండ శేఖర్, నాగుల విష్ణు, రమేష్, గంటల ప్రకాష్, బాబున్ రైతులు పాల్గొన్నారు..

# మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి పత్రం.





- బీసీ ఆజాద్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుడికాల భాస్కర్.

**- ఫెడరేషన్ నాయకులు, రాష్ట్ర పద్మశాలి సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ సంగెం సత్యనారాయణ.**

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ అక్టోబర్ 26..**
హుజురాబాద్ కెసి క్యాంపులో మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేసి బీసీ నాయకులు మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలని ప్రభుత్వం చిత్తశుద్ధితో ఆలోచించి న్యాయస్థానంలో బీసీలకు అనుకూలమైన తీర్పువచ్చేలా ప్రయత్నం చేయాలని ప్రభుత్వంతో పాటు విపక్షాలు కూడా బీసీల పట్ల నిజమైన మద్దతూ తెలియ జేయాలని న్యాయస్థానంలో చట్టబద్ధమైన తీర్పురావాలని కోరుకుంటూ, మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం రావాలని బీసీలకు రాజ్యాధికారంలో మేమెంతో మాకంత అనే నిష్పత్తి ప్రకారం రాజ్యాంగ సవరణ చేయాలని 9వ షెడ్యూల్ లో చేర్చి కేబినెట్ లో బిల్లు పెట్టాలని అన్ని రాజకీయ పార్టీలు ఆ బిల్లుకు మద్దతూ ఇవ్వాలని కోరుకుంటూ మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తూ వినూత్నమైన కార్యక్రమం ద్వారా అన్ని వర్గాల మద్దతు కోరుతున్న బీసీ ఆజాద్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుడికాల భాస్కర్, రాష్ట్ర పద్మశాలి సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ సంగెం సత్యనారాయణ , బీసీ ఆజాద్ ఫెడరేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఇప్పకాయల సాగర్, బీసీ ఆజాది స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు పంజాల రేవంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వ్యాసబట్టు మధుసూదన్ రాజు, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జ్ జినుకల లక్ష్మణ్ రావు, వరంగల్ జిల్లా అధ్యక్షులు గజవెల్లి మనోహర్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు క్యాతం మహేందర్, జూపాక శివమణి, అఖిల్ తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

# నేడు ప్రజావాణి రద్దు

**- ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్**



**కరపత్రం ప్రతినిధి రాజన్న సిరిసిల్ల**
రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో (సోమవారం) నేడు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజావాణి కార్యక్రమం నిర్వహించే ఆడిటోరియంలో ఎ4 మద్యం దుకాణాల టెండర్ కు సంబంధించిన లక్కీ డ్రా ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలు గమనించాలని ఆమె సూచించారు.

# బాధితునికి ఫోన్ అప్పగించిన రూరల్ ఎస్సై




**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
గత రెండు సంవత్సరాల కింద పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ ని సీఈఐఆర్ టెక్నాలజీ సహాయంతో స్వాధీనం చేసుకుని తిరిగి బాధితునికి వేములవాడ రూరల్ ఎస్సై చల్లా వెంకట్రాజం ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే, లేదా గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనం చేసిన వెంటనే కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన సీఈఆర్ (సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్) లో పూర్తి వివరాలు నమోదు చేసి పోగొట్టుకున్న ఫోన్ ను నేరుగా బ్లాక్ చేయవచ్చని, తద్వారా కోల్పోయిన ఫోన్ ను తిరిగి పొందే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ పోర్టల్ ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ఎవరైన సెకండ్ హ్యాండ్ ఫోన్స్ అమ్మితే కొనవద్దని సూచించారు. మీరు అమ్మే సెకండ్ హ్యాండ్ ఫోన్లు కూడా ఆమోదం పొందిన షాప్ లలోనే అమ్మాలని, లేకపోతే ఎక్కడపడితే అక్కడ అమ్మితే అవి సైబర్ నేరగాళ్ళ చేతులలోకి వెళ్లే అవకాశం వుంది కాబట్టి జాగ్రత్త వహించాలని తెలిపారు.



# మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా గుడిసె శంకర్

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ మున్సిపల్ విలీన గ్రామమైన శాత్రాజుపల్లి మాదిగ సంక్షేమ సంఘం ఎన్నికలు ఆదివారం జరిగాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్షులుగా గుడిసె శంకర్,ఉపాధ్యక్షులుగా గుడిసె దాసు, ప్రధాన కార్యదర్శిగా బండ మహేందర్, కోశాధికారిగా గుడిసె నాగరాజు, సంయుక్త కార్యదర్శిగా మల్లారం తిరుపతి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు గుడిసె క్రాంతి, గుడిసె అనిల్ కుమార్, మోకేనపల్లి తిరుపతి, లింగంపల్లి దిలీప్ లు ప్రకటించారు. ఎన్నికైన సంఘ అధ్యక్ష, కార్యవర్గ సభ్యులకు వేములవాడ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం, మాజీ అధ్యక్షులు గుడిసె మనోజ్ కుమార్ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఎయిర్ పిస్టల్ విభాగం లో రాష్ట్ర స్థాయికి పులి సనిషిత

**- పలువురి అభినందనలు**

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**



69 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ లో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో స్వదేశీ షూటింగ్ అకాడమీలో జరిగిన ఎయిర్ రైఫిల్ షూటింగ్ విభాగంలో వేములవాడకు చెందిన ఉపాధ్యాయులు పులి రామ్ గోపాల్ గౌడ్ - సుధారాణి ల కూతురు పులి సనిషిత 10 మీటర్స్ ఎయిర్ పిస్టల్ షూటింగ్ U- 19 బాలికల విభాగంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొదటి స్థానం పొంది గోల్డ్ మెడల్ సాధించి , రాష్ట్రస్థాయి ఎస్జిఎఫ్ కు ఎంపికైంది. ఈ సందర్భంగా సనిషిత మాట్లాడుతూ"మా తల్లిదండ్రులు, శిక్షకులు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా జిల్లా స్థాయిలో రాణించి గోల్డ్ మెడల్ సాధించడం, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం చాలా గర్వంగా ఉందని, రాష్ట్రస్థాయి లో కూడా ప్రతిభ కనబరిచి, జాతీయస్థాయి కి కూడా వెళ్ళి, జాతీయ స్థాయిలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు మంచిపేరు తీసుకవస్తానని, తల్లిదండ్రుల ప్రోత్సాహం, శిక్షకుల విలువైన మెలుకువలు మరువలేనివని " పేర్కొన్నారు.సనిషిత రాష్ట్ర స్థాయి ఎయిర్ పిస్టల్ షూటింగ్ కు ఎంపిక కావడం పట్ల పలువురు ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషులు, తల్లిదండ్రులు సనిషిత కు అభినందనలు తెలిపారు.

# జూబ్లీహిల్స్ మధురానగర్ లో మంత్రి, అభ్యర్థితో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగరాజు






**కరపత్రం ప్రతినిధిచీఫ్ బ్యూరో, అక్టోబర్ 26**
జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధి లోని 99వ డివిజన్ వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురనగర్, శ్రీనగర్ కాలనీ లో ఆదివారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నిక కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీ తో గెలిపించాలని ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలి.రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్న బీఆర్ఎస్ కు తగిన బుద్ధి చెప్పాలి. ప్రజా పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకెళ్తోంది.అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయి. ప్రజలకు మంచి పనులు చేసిన తర్వాతే ఓట్లు అడుగుతున్నాం కాబట్టి జూబ్లీహిల్స్ ప్రజలందరూ నవీన్ యాదవ్%ఎ%ని భారీ మెజారిటీ తో గెలిపించాలని ప్రజలను కోరారు. జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ పార్టీన అభ్యర్థి నవీన్ యాదవ్ ని గెలిపించడం కోసం అన్ని బూత్ ల సభ్యులు కలిసికట్టుగా పనిచేయాలని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రజల వద్దకు,ఓటర్ల వద్దకు తీసుకెళ్లాలన్నారు. అధిష్టానం ఇచ్చే సలహాలను, సూచనలను తూచా తప్పకుండా పాటించాలని ఆయన బూత్ సభ్యులకు తెలిపారు. గత పది సంవత్సరాలు అధికారంలో ఉన్న టిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి, జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి అన్యాయమే చేసింది తప్ప అభివృద్ధి చేయలేదని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ కేవలం సానుభూతిపై ఆధారపడి ఉందని అన్నారు. సానుభూతితో ఓటర్లను తమ వైపు తిప్పుకోవాలనే ఆలోచనలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ,జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి జరిగిన అన్యాయంపై మాట్లాడే ధైర్యం లేదన్నారు.జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలందరూ తనపై విశ్వాసం ఉంచి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తాను భారీ మెజారిటీతో గెలిచేలా ఆశీర్వదించాలని కోరారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని, ప్రజల అభివృద్ధి కోసం తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని నవీన్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ అధ్యక్షుడు మనోజ్ యాదవ్, ఉప ఎన్నిక ఇంచార్జిలు సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి, సోషల్ మీడియా చైర్మన్ మన్నె సతీష్, నవీన్ చౌదరి, నాగార్జున రెడ్డి , కోటేశ్వరరావు తో పాటు డివిజన్, నాయకులు, కార్యకర్తలు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహారుద్రాభిషేకం మహోత్సవాలు




**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, అక్టోబర్ 26**
కార్తీక మాసం సందర్భంగా ఆర్య వైశ్య సంఘం ఇసామియా బజార్, ఆర్య వైశ్య మహిళా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం కాచిగూడ లో మహా రుద్రాభిషేకం మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అర్యవైశ్య సంఘం ఇసామియా బజార్ అధ్యక్షుడు కల్వకుంట్ల శ్రీనివాస్ గుప్తా అధ్యక్షతన 11 మంది వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య 60కి పైగా జంటలు మహా రుద్రాభిషేకంలో పాల్గొని పూజలు నిర్వహించారు. సంఘ సభ్యులు, దాతలు అందించిన సహాయ సహాకారాలతో రుద్రాభిషేకం వేడుకలు ఘనంగా జరిగాయి. లోక కళ్యాణార్థం జరిగిన ఈ పూజా కార్యక్రమాల్లో హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు సరాబ్ లక్ష్మణ్, మాజీ అధ్యక్షుడు కొమ్మిరిశెట్టి అనిల్ కుమార్, కార్యదర్శి గాదే మహేష్, కోశాధికారి కొక్కండ నిఖిలేష్, బెజగం శ్రీధర్, విప్పుల్ అనిల్ కుమార్, గుండా మురళీకృష్ణ, అలంపల్లి రవికుమార్, గుండా విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

## నొప్పుల నివారణకు ఫిజియోథెరపీ గొప్ప చికిత్సా విధానం





» యాక్టివ్ బ్యాలెన్స్ ఫిజియోథెరపీ క్లినిక్ గొప్ప ప్రారంభం
» చీఫ్ గెస్ట్ డాక్టర్ అనిరుద్ధ దేశ్పాండే

**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, అక్టోబర్ 26**
కండరాల నొప్పుల నివారణకు ఫిజియోథెరపీ గొప్ప చికిత్సా విధానమని, ఇది దీర్ఘకాల నొప్పుల నివారణకు ఎంతో దోహదపడుతుందని డాక్టర్ అనిరుద్ధ దేశ్పాండే అన్నారు. ఆదివారం హనుమకొండ 100 ఫీట్ రోడ్డులోనీ జోహార్ కాలనీ సర్కిల్లో ఏర్పాటు చేసిన యాక్టివ్ బ్యాలెన్స్ ఫిజియోథెరపీ క్లినిక్ ను ఆయన చీఫ్ గెస్ట్ గా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో ఏర్పాటు చేసిన యాక్టివ్ బ్యాలెన్స్ ఫిజియోథెరపీ క్లినిక్ ను ట్రై సిటి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. నిర్వాహకులు డాక్టర్ వి. క్రాంతి కుమార్ మాట్లాడుతూ.. ఫిజియోథెరపీ వైద్య విధానంలో పేషెంట్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అత్యాధునిక వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. ప్రధానంగా నడుము, భుజం, మోకాలు, మెడ, కీళ్ల నొప్పులు షోల్డర్స్ ఫ్రాక్చర్స్ శస్త్ర చికిత్స సయాటికా వంటి నొప్పుల నివారణకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. నొప్పులతో బాధపడేవారు ఉపశమనం కోసం పెయిన్ కిల్లర్స్ వాడుతున్నారని అవి తాత్కాలికమైనవని ఆయన పేర్కొన్నారు. స్టేట్ ఫిజియోథెరపీ ప్రెసిడెంట్ తిరుమల రామకృష్ణ మాట్లాడుతూ.. ఫిజియోథెరపీ నిర్వహణలో వివిధ దేశాల నుండి అత్యాధునిక పరికరాలను తీసుకురావడం జరిగిందన్నారు. పక్షవాతం మెడ నొప్పి చిన్న పిల్లలు ఎదుగుదల భవిష్యత్తులో ఎలాంటి రోగాలు రాకుండా నివారణకు ఫిజియోథెరపీ ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. నగరంలో ఏర్పాటు చేసిన యాక్టివ్ బ్యాలెన్స్ ఫిజియోథెరపీ క్లినిక్ ను ట్రై సిటీల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డా. అనిరుద్ధ దేశ్పాండే, డా. సాయిని వెంకటేశ్వర్లు, డా. శశికాంత, డా. కంచ నరేష్, డా. సురేష్ చంద్ర, డా. పెరుమాండ్ల రామక్రిష్ణ, డా. శివరామకృష్ణ, డా. ప్రకాష్ , డా.రాము, జిల్లాలోని ప్రముఖ ఫీజియోథెరపిస్టులు 56వ కౌన్సిలర్ సునీల్, 56 వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంకా హరిబాబు, 56వ డివిజన్ బీజేపీ మాజీ అధ్యక్షులు మహేందర్, డాక్టర్ సురేందర్ రెడ్డి, డాక్టర్ శశికాంత, బీ ఎస్ జీ వశిష్ట, కుంచ నరేష్, దిలీప్, సాయికిరణ్, మేఘన, పోచన రాజు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవర్ ఏకాంబరంకి ఆర్థిక సాయం అందించి మానవత్వం చాటుకున్న మిత్ర బృందం



**కరపత్రం ప్రతినిధి/చీఫ్ బ్యూరో, అక్టోబర్ 26**
కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ డ్రైవర్ రాళ్లబండి ఏకాంబరంకి ఆదివారం ఓన్ ప్లేట్ డ్రైవర్ మిత్ర బృందం రూ. 19వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. తోటి డ్రైవర్ పల్లెర్ల యాకుబ్ అధ్యక్షతన ఆదివారం రోజున డ్రైవర్ల మిత్రబృందంతో కలిసి బాధితుడికి ఆదివారం రోజున నగదు సాయం అందించారు. బాల సముద్రంలోని ఏకాంబరం ఇంటికి వెళ్లి పరామర్శించారు. అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎం మహేష్, సిహెచ్ కృష్ణ, డీజే నరేష్ , ఎం రమేష్, ఏ రాజేందర్, ఏ గణేష్, ఏ ప్రవీణ్, కే ప్రవీణ్, ఎస్ చిరంజీవి, బి సురేష్, పి సురేష్, ఎస్ అశోక్, బి విజయ్, వి నవీన్, ఈ మహేందర్, పరశురాములు, ఎస్ విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

**కరపత్రం ప్రతినిధి/చీఫ్ బ్యూరో, అక్టోబర్ 26**




ఉర్సుగుట్ట, ఆకుతోట కన్వెన్షన్ లో జరిగిన పోషాల లీలాదేవి రాజ్ కుమార్ గార్ల కుమార్తె వివాహానికి హాజరై నూతన వధూవరులకు పుష్పగుచ్ఛం అందజేసి ఆశీర్వదించారు.మడికొండ ధర్మసాగర్ రోడ్డులోని ఎ కన్వెన్షన్ లో జరిగిన స్టేషన్ ఘనపూర్ మండలం కొత్తపల్లి గ్రామ మాజీ సర్పంచ్ కీసర ముత్యం రెడ్డి కుమార్తె వివాహ మహోత్సవానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.అనంతరం..హన్మకొండ నయీంనగర్ లోని శ్రీరస్తు కన్వెన్షన్ లో జరిగిన శాసనసభ్యులు కడియం శ్రీహరి వ్యక్తిగత సహాయకులు ముక్క రాకేష్ కుమార్తె ముక్క శ్రీకరి నూతన వస్త్ర ఫలపుష్పాలాంకరణ కార్యక్రమానికి హాజరై చిన్నారి శ్రీకరిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాలలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బజరంగ్ సేన మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కృష్ణవేణి

**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, అక్టోబర్ 26**




బజరంగ్ సేన మహిళా విభాగం తెలంగాణ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా వోరుగంటి కృష్ణవేణిని నియమిస్తూ బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆదివారం కాచిగూడ లోని బజరంగ్ సేన రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో కృష్ణవేణిని ప్రియాచారి, మొగిలిగిద్ది మనోజ్, ఉమా బిరాదార్, ఉప, తదితరులు సత్కరించి అభినందనలు తెలియజేశారు. అనంతరం కృష్ణవేణి మాట్లాడుతూ హిందూ మహిళల రక్షణకు, సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామని అన్నారు. బజరంగ్ సేన లక్ష్యాలను సాధించడానికి ఎంతటి పోరాటాలకైనా సిద్ధమని ఆమె తెలిపారు.

## తప్పిపోయిన బాలుడిని తల్లికి అప్పగించిన సుబేదారి పోలీసులు



**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, అక్టోబర్ 26**
ఆదివారం సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో హనుమకొండ జూలైవాడ ప్రాంతానికి చెందిన ఐదేళ్ల అహ్మద్ అనే బాలుడు అనుకోకుండా తప్పిపోయి, సుబేదారి పరిధిలోని శాంతినగర్ కాలనీ ప్రాంతంలో తిరుగుతుండగా సుబేదారి పోలీసులు గుర్తించారు.తక్షణమే ఆ బాలుడిని సురక్షితంగా సుబేదారి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి, పరిసర ప్రాంతాల్లో విచారణ జరిపి బాలుడి తల్లిదండ్రులను గుర్తించి, వారికి సమాచారం అందించారు.తరువాత ఆ బాలుడిని అతని తల్లికి సురక్షితంగా అప్పగించారు. ఈ సందర్భంలో బాలుడిని సమయోచితంగా గుర్తించి తల్లిదండ్రుల వద్దకు చేర్చిన బ్లూ కోట్స్ కానిస్టేబుల్ సత్యనారాయణ ను సుబేదారి ఇన్స్పెక్టర్ శ్రీ ఎం. రంజిత్ కుమార్ అభినందించారు.

## ప్రిజమ్ క్రాప్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో స్టాల్ ఏర్పాటు

### ⊙ జోనల్ మేనేజర్ అనిల్ వెల్లడి

**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, అక్టోబర్ 26**




వరంగల్ హంటర్ రోడ్డు లోని ఉమ్మడి వరంగల్ జిల్లా వెలమ సంక్షేమ సంఘం భవనం ఆవరణలో అధ్యక్షుడు నడిపెల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన రైతు సదస్సు కార్యక్రమంలో రైతుల కోసం ప్రిజమ్ క్రాప్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ చైర్మన్ యుగేందర్ రావు ఆదేశానుసారం స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు జోనల్ మేనేజర్ అనిల్ మీడియాకు ఆదివారం వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రిజమ్ క్రాప్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ కంపెనీ అందించే నాణ్యమైన పురుగుమందులు,ఫెస్టిసైడ్స్, హెర్బిసైడ్స్,ఇన్ ఫెర్టిసైడ్స్ ఆర్గానిక్,అగ్రికల్చర్ ఉత్పత్తులు రైతులు పంటల్లో వాడటం వల్ల ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు.తమ కంపెనీ మందులు వరి, పత్తి, మిర్చి, మామిడి పంటలకు వాడటం వల్ల రైతులకు అధిక దిగుబడులు వచ్చి అధిక లాభాలు వస్తాయని తెలిపారు.దేశవ్యాప్తంగా 20 రాష్ట్రాల్లో తమ కంపెనీ ఉత్పత్తులు రైతులు వాడుతున్నారని తెలిపారు. వరంగల్ జిల్లాలో తమ స్టాల్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని రైతుల నుండి ఆదరణ లభించిందని తెలిపారు.

## జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న చైర్మన్ జంగా రాఘవరెడ్డి

**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, అక్టోబర్ 26**




జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కి మద్దతుగా.. ఇవాళ జవహర్ నగర్ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం లో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, వాకాటి శ్రీహరి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ ఛైర్మెన్ జంగా రాఘవ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వాకాటి శ్రీహరి, చైర్మన్ జంగా రాఘవరెడ్డి మాట్లాడతూ.. జూబ్లీహిల్స్ అభివృద్ధి కోసం హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పదేళ్ల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్‌ను జూబ్లీహిల్స్ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని,
పదేళ్లలో రేషన్ కార్డు ఇచ్చారా..సన్న బియ్యం ఇచ్చారా.. డబుల్ బెడ్రూం ఇచ్చారా అని ప్రజలను అడిగితే ప్రజలే లేదు అని చెబుతున్నారన్నారు.కాంగ్రెస్ పార్టీ పేదవారికి అండగా నిలిచే పార్టీ అని, సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారు కానీ బీఆర్ఎస్ నేతలు పదేళ్లు దోచుకున్నారన్నారు. ఆ దోపిడి భరించలేక ప్రజలు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని తిరిగి తీసుకొచ్చారు. అభివృద్ధి, సంక్షేమం అంటే కాంగ్రెస్ పార్టీనే.. జూబ్లీహిల్స్ ప్రజల్లో వస్తున్న ఆదరణ చూస్తుంటే నవీన్ యాదవ్ భారీ మెజారిటీతో గెలుస్తారని నాకు నమ్మకం ఉందన్నారు.యువ నాయకుడైన మా అభ్యర్థి నవీన్ యాదవ్ ని ఇక్కడి ప్రజలు గెలిపించి కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తారని ధీమా వ్యక్తం చేశారు.